# మందిరానికి అటూ, యిటూ

యం. హీరాలాల్ రాయ్

ఆమె నడుస్తూవుంది. ప్రాణాలు కొసకంటుతూ వున్న అస్థిపంజరం కదులుతూ వున్నట్టుగా సాగుతున్నది. నెమ్మదిగా నదివైపుకు పురోగమిస్తూ వున్నది, శరీరంతోపాటు కొంత బరువునుకూడా మోసుకుంటూ. కళ్ళనుండి అశ్రుకణాలు చెక్కిళ్ళపై జారుతూ, ప్రవహిస్తూ వున్నవి; మందిరం యొక్క ద్వారంవరకూ ఆమె అలాగే పోయింది.

హృదయం ఆశతో నిండిపోయింది. మందిరంలోని భగవంతుడు తినడానికి, కట్టడానికీ సమకూర్చకుండా వట్టి చేతులతో పంపడన్న విశ్వాసం ఆమెలో వెలిగింది. అయితే పట్టువస్త్రాలలో వున్న ఆ భృడకాయుడైన పూజారి, మందిరం తలుపులు గడియవేస్తూండటం చూసింతరవాత ఆమె హృదయంలోని ఆశ కాస్తా అణగారిపోయింది. ఆమె కాళ్ళల్లో ముందుకు సాగడానికి కూడా సత్తువలేకుండా పోయింది.

మందిరపు ద్వారంలోని లావుపాటి ఇనుప చువ్వలగుండా మెరుస్తూవున్న విగ్రహం కనిపిస్తున్నది. విగ్రహంచేతిలో మురళివుంది. దివ్యమైన దుస్తుల్లోవున్న ఆవిగ్రహం, ఆదీనురాలిని చూస్తూ నవ్వుతూన్నట్టనిపించింది. ఆవిగ్రహం ఎదురుగా ఫలహారం, ప్రసాదం వుంది. ఎలుకలు వాటి చుట్టూ పచార్లు చేస్తూవున్నవి. ఎలుకలకోసమే ఆపదార్థాలు ఉద్దేశింప బడ్డాయా అనిపిస్తుంది.

విగ్రహానికి ఎదురుగా కొంచెం ఎడంగా పూజారి తివాచీమీద కూచునివున్నాడు. ఎదురుగావున్న గ్లాసులో, కాస్త ఎరుపుగాఉన్న ద్రవపదార్థం. నిషాగాలి ఎగజిమ్ముతోంది. మందిరంలో ఇంకా ఎవరూ కనిపించరు; అయితే, ఏదోమూలనుండి గాజుల చప్పుడు వినవస్తూవుంది.

"అయ్యగారూ! సందాకబళం తండ్రీ!...... అన్నంలేదు బాబయ్యా! ప్రసాదం దయచేసి ఈ దీనురాలిని కాపాడండి" అంటూ బికారి.

పూజారికి కోపంవచ్చింది; "ఏమిటీ అర్ధరాత్రి పానకంలో పుడకలాగా తయారయ్యావ్!... బుద్ధిలేదూ...? ఇక్కడేం దొరకదు. వెళ్ళిపో!" అంటూ గదమాయించాడు.

"బాబుగారూ!...వారం రోజులనుండి ఏమీ తినలేదు. కరుణించండి! ఏమైనా తినడానికి పెట్టండి!" అంది బికారిణి ఎంతో భయపడుతూ.

'పో! వెళ్ళిపో!...చెప్పేది నీకుగాదూ...? మా సౌఖ్యానికి అడ్డు తగులుతున్నావ్" అంటూ పూజారి గ్లాసునుండి చూపుల్ని, ఓరగా మందిరంలోని ఒక గదివైపుకు మరలుస్తాడు.

ఆమెకాళ్ళు వణుకుతూ వున్నవి. తడిసిన వస్త్రంవలె ఎముకలకు శరీరంఅంటుకొనిపోయింది. కాళ్ళలోసత్తువ పూర్తిగా ఖాళీ అవుతూవుంది.

ఆపేదరాలి ఆలోచనలు గిర్రున తిరిగాయి. "నా కాళ్ళుకూడానాకు ఎదురుతిరుగుతూన్నయ్. ఏమిటీ ఘోరవర్షం...! ఈతుపానుగాలి ఎందుకు? కనీసం ఈరాత్రికైనా ప్రకృతిమాత శాంతి వహించలేదా?" ఆలోచనా పరంపరలు ఆమె హృదయాన్ని కల్లోలపరుస్తూ వున్నవి.

ఆమె ఒకజీవిని ప్రసవించాలి. నొప్పులు వస్తూ వున్నవి. కాని, ఆమెలోని బలహీనత బాధల్ని కూడా బహిరంగ పరచనీయడం లేదు...దారిలో వున్న రాతికి అడ్డంవచ్చి, నేలన కూలిపోయింది.

వర్షానికికూడా దాక్షిణ్యం లేకపోయింది. తుపానుగాలి వేగం ఇంకా హెచ్చింది. వర్షధారలమధ్య, శీతలగాడ్పుల మధ్య, నలిగి నేల కొరిగిన భికారిణి శాశ్వతంగా కండ్లుమూసింది.

మందిరంలో పూజారి సంపూర్ణంగా నిషాలో వున్నాడు.

కాళ్ళగజ్జల మధురస్వరం వినిపిస్తూవున్నది. బహుశః ఎవరైనా సుందరాంగి నాట్యంచేస్తూ వుండవచ్చు అప్పుడప్పుడు పూజారి గొంతు చినిగిపోయేటంత గట్టిగా నవ్వుతూన్నాడు. భగవంతుడుకూడా ఆనవ్వులలో భాగం పంచుకుంటున్నాడేమో ననిపిస్తుంది. ఎలుకలు, ఉమదిధిని సక్రమంగా నెరవేరుస్తూ వున్నవి. ఫలహారం, ప్రసాదం, దాదాపు కావచ్చింది. ఇక ఎలుకలు విగ్రహంమీదికే ఎగబడ్డవి.